నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

చెప్పడమేనా.. పరిశుభ్రత పాటించరా..?


పీహెచ్‌సీ చుట్టూ పెరిగిన గడ్డి

నవతెలంగాణ-బోధన్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని వైద్యులే చెప్తున్నారు. కానీ వారు మాత్రం పాటించ డం లేదు. దీనికి నిదర్శనమే పెగడపల్లి పి.హెచ్.సీ. బోధన్ మండలం పెగడపల్లి పిహెచ్‌సీ చుట్టూ పిచ్చిగడ్డి పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. అయినా దాన్ని నిర్మూలించేవారు లేరు. దీంతో ఆసుపత్రి చుట్టూ పిచ్చి గడ్డి పెరిగి దోమలు పెరగడానికి ఆస్కారంగా మారింది. అసలే దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలుతాయని వైద్యులు చెపుతున్నారు. కానీ ప్రజలకు సూచనలు ఇచ్చే వైద్యులే తమ ఆసుపత్రి చుట్టూ పిచ్చి గడ్డి పెరిగి అపరిశుభ్రంగా మారిన పట్టించుకోవడం లేదు. ఆసుపత్రి సిబ్బంది స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో పిచ్చి మొక్కలు తొలగించి ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రమాదంగా కల్వర్టుపై గుంత


కల్వర్టుపై ఉన్న గుంత

- ఆదమరిస్తె అంతే

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మాజివాడీ గ్రామం వద్ద కల్వర్టుపై గుంత ఎర్పడింది. ఈ రోడ్డు లింగంపల్లి స్టేజి నుంచి భూంపల్లి మీదుగా దగ్గి రోడ్డు 44వ జాతీయ రహదారికి వెలుతుంది. ఈ రోడ్డు గుండా రాత్రి వేల ప్రయాణించె వారికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ద్విచక్ర వాహన దారులు అదమరిస్తె అంతే సంగతులు అంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చి వేయలని కోరుతున్నారు. లేకపోతే నూతన కల్వర్టును నిర్మించాలని కోరుతున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- బోధన్ జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చిన ఉచిత డయాలసిస్ సేవల విభాగాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డయాలసిస్ విభాగం ద్వారా రోగులకు అందించే సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇరవై మంది వరకు డయాసిస్ సేవలు వినియోగించుకోవచ్చని వైద్యులు తెలిపారు. చుట్టుపక్కల మండలాల నుండి డయాలసిస్ రోగులు ఇక్కడికి వస్తారని, ఏకకాలంలో ఏడుగురు చొప్పున రోగులకు డయాలసిస్ చేయవచ్చని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. ఆసుపత్రిలోని ఆర్ఓ ప్లాంట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ఇతర విభాగాలను కలెక్టర్ సందర్శించి, స్థానికంగా గల సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషంట్లను పలుకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. వైద్యుల కొరత ఉన్నట్లయితే కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల నియామకాల కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయ పాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువగా ఆస్కారం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్, తహసీల్దార్ కె.గంగాధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివశంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఆర్ఎంఓ డాక్టర్ అబ్దుల్ రహీం తదితరులు ఉన్నారు.

నాటు వేయాలా.. వద్దా..


వర్షం పడక కాలువలో నీరు లేని దృశ్యం

- చినుకు కోసం ఎదురుచూపులు
- డెడ్‌స్టోరేజీలో పోచారం ప్రాజెక్టు
- ఆందోళనలో రైతన్నలు
- అడుగంటి పోతున్న భూగర్భ జలాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా వర్షాలు ముఖం చాటు చేయడంతో రైతన్నలు చినుకు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తాయా లేదా.. ఖరీఫ్‌లో సాగు అవుతుందా లేదా.. అనే అయోమయ పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు.

ప్రతిసారి 18 వేల ఎకరాల్లో వరి సాగు..

నాగిరెడ్డిపేట మండలంలో ఖరీఫ్ సీజన్లో ప్రతిసారి 18 ఎకరాల్లో వరి సాగు చేయడం జరుగుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడుస్తున్నా వర్షాలు కురువకపోవడంతో సీజన్‌పై పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యే పరిస్థితిలో రైతన్నలు ఉన్నారు.

బోరు బావులు ఉన్నా.. పోచారం ప్రాజెక్టే ఆధారం..

పోచారం ప్రాజెక్టు ఆయకట్టున బోరు బావులు ఉన్నాయి. కానీ పోచారం ప్రాజెక్టులో నీరు చేరితే గాని బోరువావులు పుష్కలంగా నీరు అందించలేవు. గత సంవత్సరం జూలై 21న పోచారం పూర్తిస్థాయిలో నిండింది. పోచారం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1.820 టీఎంసీలు..(1464 ఎం సి ఎఫ్‌టి) పూర్తిస్థాయిలో నిండితే ఖరీఫ్ యాసంగి రెండు పంటలకు పుష్కలంగా నీరు అందిస్తుంది. వానాకాలం 18 ఎకరాలకు, యాసంగిలో 16 వేల ఎకరాలకు నీరును అందించే పోచారం నేడు వెలవెల పోవడంతో రైతన్నలు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుడు కరుణించి పోచారం నిండితే రెండు పంటలకు పుష్కలంగా నీరు లభిస్తుంది.

వాన దంచి కొడితే మూడు రోజుల్లో పోచారం నిండుతుంది..

1.820 టీఎంసీల సామర్థ్యం గల పోచారం ప్రాజెక్టు మూడు నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు దంచి కొడితే ఇట్టే నిండిపోతుంది. పోచారంపై ఆశలతోనే ఆయకట్టు రైతులు నాట్లు వేయడం ప్రారంభించారు.

పోచారం ప్రాజెక్టు ఆధారంగా వరి సాగు....

నాగిరెడ్డిపేట్ మండలంతో పాటు ఎల్లారెడ్డిలో కొన్ని గ్రామాలకు సాగు, తాగునీరు అందించే పోచారం ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. నాగిరెడ్డిపేట మండలం లో పోచారం ప్రాజెక్టు నిండితే భూగర్భ జలాలు పెరిగి బోరుబావులు పుష్కలంగా నీళ్ల అందిస్తాయి. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు నీరు డెడ్ స్టోరేజ్ కి చేరడంతో పోచారం ప్రాజెక్టు చుట్టుపక్కన ఉన్న బోరు బావులు నీరు అడుగడంతో బోరుబావులు నీళ్ల అందించలేక పోతున్నాయి. ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు బోరుబావులపై ఆధారపడి పంటలను సాగు చేసే క్రమంలో ఉన్నారు ఆయకట్టు చుట్టూరా బోరుబావులు ఉండటంతో బోరుబావులపై ఆధారపడి పంటలను వేస్తున్నారు వర్షాలు కురవక పోవడంతో బోరుబావులు సైతం నీరు అందించలేకపోతున్నాయి పోచారం ప్రాజెక్టుపై ఆధారపడిన రైతన్నలు వర్షాలు కురిస్తే గాని పంటలు పండే అవకాశం లేకుండా పోయింది.


పెద్దన్నను పరామర్శిస్తున్న నాయకులు

పెద్దన్నకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- సిపిఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్
- బాధితునికి పరామర్శ

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని తల్వేద గ్రామంలో భూ వివాదంలో బొమ్మెన పెద్ద పెద్దన్న అనే వ్యక్తిని దళిత సంఘాలు, సిపిఎం పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... బాదితునికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. తల్వేద గ్రామంలో భూ వివాదంపై 2023లో పెద్ద పెద్దన్న ఆరుగురిపై ఫిర్యాదు చేయగా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కేసు పెట్టినందుకు కక్ష కట్టి ఈనెల 8న బాధితునిపై విచక్షణారహితంగా దాడి చేయగా తీవ్ర గాయాల పాలైన బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు అసలైన సూత్రధారి అమలపురం సాయిరెడ్డిని తప్పించారని ఆరోపించారు. పోలీసుల దళితుడైన పెద్దన్నపై నిర్లక్ష్యం వహిస్తూ నిందితులకు మద్దతు తెలపడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అతని పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా సిపిఎం నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.


దోమల మందు వాహనం ద్వారా స్ప్రే చేస్తున్న కార్మికులు

దోమల నివారణకు చర్యలు

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

దోమల బెడదతో ప్రజలు మంచం పట్టరాని నవతెలంగాణ పత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. నసురుల్లాబాద్ మండలంలోని సంగెం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పరిరక్షణ, దోమల బెడద నిరవరణకై చర్యలు తీసుకున్నట్లు మండల పంచాయతీ అధికారి రాము తెలిపారు. శనివారం, ఆదివారం రెండు రోజుల నుంచి గ్రామాల్లో ఫాగింగ్ చెయ్యడం జరిగింది. దోమల బెడద తీవ్రంగా ఉండడంతో గ్రామాల్లో ఉన్న చెత్త చెదరంను తొలగించారు. మురికి కాలువలను మురికి లేకుండా చర్యలు తీసుకున్నారు. మాజీ ఎంపిపి అధ్వర్యంలో గ్రామంలో తిరుగుతూ గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామ పంచాయతీ, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో దోమల నివారణా చర్యలు చేపట్టి, డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సమిష్టి కృషితో జ్వరాలు ప్రబలకుండా చూడాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతకోసం ప్రజలకు అవగాహన కల్పించారు.

రైతు వేదికలు.. మందుబాబులకు అడ్డాలు



రైతు వేదిక భవనం

నవతెలంగాణ-మోపాల్

వ్యవసాయ సాగులో కర్షకులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన రైతు వేదికలు అధ్వానంగా మారాయి. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయంలో నిపుణులద్వారా సమాచారం అందించడానికి వాటిని నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయింది. నిధులు లేక అధ్వానంగా తయారయ్యాయి. వీటి నిర్వహణ కొరవడి రైతులు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐదు వేల రైతులను ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికలను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని ఏర్పాటు చేసిన ప్రారంభంలో రైతు వేదికల నిర్వహణకోసం దాదాపు 5 నెలల పాటు నెలకు 9వేల చొప్పున అందించారు. వీటిని స్వీపర్ తాగునీరు, ఆఫీసు కరెంట్ బిల్లు, స్టేషనరీ కొరకు వినియోగించేవారు. దాదాపు రెండు సంవత్సరాల నుండి ఇప్పటివరకు ఈ రైతు వేదికల నిర్వాణ కొరకు ఒక రూపాయి కూడా చెల్లించడం లేదు. సరియైన నిర్వహణ లేక అలాగే ఇవి ఊర చివర ఉండడంతో రాత్రి సమయంలో ఈ రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగాను అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. కొంతమంది ఏఈఓలే తమ రైతు వేదికలను వారే శుభ్రపరచుకునే పరిస్థితికి దిగజారింది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన రైతు వేదికలకు నిర్వాహణలేకుండా పోయింది. మోపాల్ మండల కేంద్రంలో మూడు రైతు వేదికలు ఉన్నాయి. అందులో మంచిప్ప రైతు వేదికకు 39వేలు, కంజర రైతు వేదికకు 77వేలు, మోపాల్ రైతు వేదికకు 23 వేల రూపాయలు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఎప్పుడు విద్యుత్ సిబ్బంది వచ్చి ఆ రైతు వేదికలకు విద్యుత్ని కట్‌చేస్తారో తమ కార్యకలాపాలకు ఎక్కడ ఆటంకం కలుగుతుందని ఏఈవోలు ప్రతిక్షణం ఇబ్బంది పడుతున్నారు. అసలే రైతు వేదికలకు రక్షణ లేక ఇబ్బంది పడుతుంటే అందులో భాగంగా కొన్ని రైతు వేదికలకు ఈ మధ్య కాలంలో మూడు లక్షల 50 వేల రూపాయల వ్యయంతో ఒక టీవీ, కంప్యూటర్, సిపియు, బ్యాటరీ స్పీకర్స్‌ని ఏర్పాటు చేశారు. ఒక దిక్కు రైతు వేదికలను కాపాడుకోవడమే వ్యవసాయ అధికారులకు తలకు మించిన భారం అవుతుంటే దానికి తోడు ఈ కొత్త పరికరాలను తెచ్చి ఇంకా ఇబ్బందుల్లో పడేశారు. ఇంత ఖర్చు పెట్టి కొత్త సామగ్రిని తెచ్చినప్పుడు వీటిని దొంగల బారినుండి కాపాడడం చాలా కష్టం అవుతుంది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి దాదాపు 9 నెలల సమయం కావస్తుంది. తమ ప్రభుత్వం కర్షక ప్రభుత్వం, రైతుల ప్రభుత్వం అని చెప్పుకునే ప్రభుత్వం కాబట్టి, ఇప్పటికైనా రైతు వేదికలపై దృష్టి పెట్టాలని, వాటి మెయింటెనెన్స్ కొరకు నిధులను సకాలంలో విడుదల చేయాలని అలాగే ప్రతి రైతు వేదికకు ఒక వాచ్మెన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాచ్మెన్ ఏర్పాటు చేయడం వల్ల అందులో ఉండే ఫర్నీచర్ కు రక్షణ ఉంటుందని, రైతు వేదిక చుట్టూ మొక్కలు పెంచిన వాటికి రక్షణ ఉంటుందని వారు కోరుతున్నారు.

రైతు వేదికల నిర్వహణతో పాటు ఏఈఓ లు అంటే కేవలం రైతు భరోసా రైతు బీమా కొరకే కాకుండా రైతులు తమ పొలాలకు కావాల్సిన రసాయనాల గురించి నూతన వంగడాల గురించి అడిగి తెలుసుకోవాలి. పంటకు కావాల్సిన పోషకాల గురించి అనుక్షణం వారిని సంప్రదించాలి. చాలా మట్టుకు రైతులు కేవలం రైతు బీమా, రైతు భరోసా కొరకే వారిని సంప్రదిస్తున్నారు అలాంటి పద్ధతిని మార్చుకొని వారిని వ్యవసాయ అధికారులుగా వ్యవసాయానికి సంబంధించిన వాటి పైన కూడా అధికారుల సూచనలు తీసుకోవాలి అప్పుడే వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడిక ఏర్పడి అధిక మొత్తంలో దిగుబడులు సాధించవచ్చు. అప్పుడే రైతుల కళ్ళల్లో ఆనందాన్ని వెలువడుతాయి.


రైతు వేదిక భవనంలో కంప్యూటర్, పరికారులు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి

పోడు రైతులపై అక్రమ కేసులను కొట్టివేయాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు

నవతెలంగాణ-కామారెడ్డి

గిరిజన పోడు రైతులపై పెట్టిన కేసులు కొటివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు అన్నారు. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలం ఎల్లంపేట నడిపి తండాలో ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజన రైతులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు మాట్లాడుతూ తాతల కాలం నుండి సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న గిరిజన రైతులపై ఫారెస్ట్ అధికారులు, పోలీసులు జులుం ప్రదర్శించారన్నారు. ప్రధానంగా ఫారెస్ట్ అధికారులు, పేద ప్రజలైన గిరిజన రైతులు డబ్బులు ఇవ్వకపోవడంతో నాన్ పొజిషన్ అని సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు. ఇది గమనించని జిల్లా అధికారులు, పోలీసులు నడిపి తండా గిరిజనులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. టెర్రరిస్టులను పట్టుకున్నట్టు పోలీసు బలగాలతో ఇంటింటికి తిరిగి దొంగలను మాదిరిగా రైతులను వేధించారన్నారు. పోలీసు జీబులు వారి ఇండ్ల చుట్టూ తిప్పుతూ సౌండ్ హార్న్‌స్తూ భయభ్రాంతులకు గురి చేశారని ఈ దుర్మార్గానికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులు, పోలీసులపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే ప్రజలపై పోలీసులు, ఫారెస్ట్ అధికారులతో గిరిజనుల మీద దాడులకు దిగుతుందన్నారు కాంగ్రెస్ హయాంలు ఇచ్చిన హక్కు పత్రాలు, పోడు భూముల పత్రాలను టిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని మళ్లీ అదే కాంగ్రెస్ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. హక్కు పత్రాలు ఇచ్చి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలలి డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని ఫారెస్ట్ అధికారులపై పోలీసులపై మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేస్తామన్నారు. గిరిజన రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూక్య మాన్సింగ్ కొమ్ములు పెంట్యా మాన్సింగ్ దశరథ్, నరహరి, బాలు, నరేష్, సురేష్, రవి శ్రీను చందర్ వ్యాకాశా జిల్లా అధ్యక్షుడు వెంకట్, నాయకులు లిమియా తదితరులు పాల్గొన్నారు.

అరకలతో సగం ఖర్చులు ఆదా


చిన్న అరకలతో దున్నుతున్న రైతులు

- రోజుకు పది ఎకరాల వరకు దున్నడం
- కలుపుతీసే ఖర్చు తక్కువ

నవతెలంగాణ-జుక్కల్

కూలీ ఖర్చులు మిగిలేందుకు రైతులు చిన్న అరకలతో పంట భూములు దున్నుతున్నారు. దీంతో కలుపు తీసే ఖర్చులు మిగులు బాటు అవుతాయని రైతులు చెబుతున్నారు. తక్కువ ఖర్చుతో రోజుకు పది ఎకరాల వరకు కలుపు మొక్కలను చిన్న అరకతో దున్నడం వలన పంటలకు బలం చేకురుతుంది. పూర్వం నుంచి కాడెద్దులకు కానీ వేసి సుమారుగా నాలుగు నుంచి ఆరు చిన్న అరకలు కట్టి (కొలిపెలు అనే పరికరం వాడుకలో ఉన్న భాషలో) వాడటం జర్గుతుంది. చిన్న కొళిపెలు ఎన్ని ఉంటే అందరు మవుషులు అవసరం ఉంటుంది. పంట సాళ్లలో చిన్న అరక కొళిపెలతో దున్నడం వల్ల కలుపు ఖర్చులు భారీగా తగ్గడంతో పాటు ఒక్కరోజులోనే పది ఎకరాల వరకు దున్నడం జర్గుతుంది. తక్కువ ఖర్చుతో పాటు సమయం ఆదా, అనుకున్నంత పని జర్గుతుంది. ఒక విధంగా ఇది రైతులకు ఖర్చు మిగులుతోపాటు కలుపు నివారణ అవుతుంది.

ఖరీఫ్ సీజన్‌లో పండించే పెసర, మినుము, కంది, సోయా, పత్తి, సాళ్లలో కలుపు తీసేందుకు రైతులు అరకలు ఉపయోగిస్తారు. కలుపునివారణకోసం దున్నాలంటే వర్షం లేకుండా ఉండి భూమి కొంత అరిపోయి ఉండాలి. తడి ఉంటే పని సాగక పోవడంతో పాటు సమయం వృథా అవుతుంది.

మాములుగా కూలీలకు పెట్టి కలుపు తీయిస్తే ప్రస్తుతం రేటు రోజుకు మహిళలకు ఐదువందలు చెల్లించాలి. ఎకరాకు గడ్డిని పట్టి సుమారుగా పదిహేను మంది కూలీలు అవసరమవుతారు. ఒక ఎకరాకు రూ.7500 కర్చు అవుతుంది. చిన్న కొళిపెలతో ఎకరాకు రెండువేలు నుంచి మూడు వేలు ఖర్చు అవుతుంది. సుమారుగా సగం డబ్బులు మిగులు బాటు రైతులకు కల్గడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత రక్త పరీక్షలు



లయన్స్ క్లబ్ అధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి అధ్వర్యంలో ఆదివారం వాకర్ అసోసియేషన్ సభ్యులకు ఉచిత రక్త పరీక్షలను నిర్వహించారు. అనంతరం క్లబ్ సభ్యులు వాకర్ అధ్యక్షుడు జనార్ధన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఏర్పాటుచేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ అధ్యక్షుడు అందే వెంకట గిరిని వాకర్ అసోసియేషన్ సభ్యులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట గిరి, సెక్రెటరీ ద్యవతి పోశెట్టి, ట్రెజరర్ కటిక శ్రీనివాస్, సభ్యులు తౌటు గంగాధర్, అలవాల వెంకటేశ్వర్లు, భూస రత్నాకర్, భూస శ్రీనివాస్, మెడికల్ నరేందర్, కళ్యాణ్ రాజేందర్ పాల్గొన్నారు.

చురుకుగా బ్రిడ్జి నిర్మాణం పనులు



నవతెలంగాణ - బోధన్

బోధన్ మండలం నాగన్‌పల్లి సమీపంలోని పసుపు వాగుపై బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపడు తున్న బ్రిడ్జి పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే సాలుర మంజీర నదిపై భారీ వంతెనలు పూర్తి చేసిన అధికారులు అక్కడి నుండి పెగడపల్లి వరకు బైపాస్ రహదారిని పూర్తి చేశారు. దాంతో సాలూరు చెక్ పోస్ట్ నుండి సాలూరు క్యాంప్ వరకు, నాగన్‌పల్లి శివారు వరకు బైపాస్ రహదారి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మరికొన్ని రోజుల్లో ఈ వంతెన పనులు ముగిసి రహదారిని ప్రారంబించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏదేమైనా ఈ బైపాస్ రహదారితో అంతరాష్ట్ర రవాణా మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ఒకే సొసైటీ.. ఇద్దరు కార్యదర్శులు

- నేనంటే నేను పోటీ
- ఒక కార్యదర్శి ఉండగా మరొకరిని డిప్యుటేషన్‌పై పంపిన జిల్లా అధికారి
- మద్దతుకోసం అధికార పార్టీ నాయకులకు, డైరెక్టర్లకు దావత్‌లు
- సీఈఓ సీటు కోసం ఒకరు కోర్టు మెట్లు ఎక్కితే మరొకరు అధికార పార్టీ నాయకుల మెట్లు ఎక్కుతున్నరు



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో గల సొసైటీలో ఒక్క కార్యదర్శి ఉండగా మరో కార్యదర్శిని నియమించడంపై స్థానికులు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. ఒక్క కుర్చీ కోసం ఇద్దరి అధికారుల పాకులాట అంతా ఇంత కాదు.. చెయ్యని విశ్వ ప్రయత్నాలు లేవు. అవినీతి కూపంలో కూరుకుపోయిన సొసైటీలో ఇదో కొత్త డ్రామా. అన్నింట్లోనూ ఇద్దరు ఇద్దరే వీరికి వీరే పోటీ అనే గుస గుసలు వినిపిస్తున్నాయి. సహకార సంఘాలను ఆనాటి ప్రభుత్వాలు రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశాయి. రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘం ముఖ్య ఉద్దేశం. మాక్లూర్ సహకార సంఘంలో ఒక్క సీఈఓ కుర్చీకి ఇద్దరు అధికారుల పాట్లు అంతా ఇంత కాదు. ఒకరు కుర్చీ కోసం కోర్టు మెట్లు ఎక్కితే, మరొకరు అధికార పార్టీ నాయకుల మెట్లు ఎక్కుతున్నారు. సొసైటీ యాక్ట్ హెచ్ఆర్ పాలసీ ప్రకారం డిప్యూటేషన్లు రద్దు అయినప్పటికి, డీఎల్‌ఈసీలో ఆమోదం తెలిపి నిజామాబాద్‌లో పని చేస్తున్న కార్యదర్శి విష్ణువర్ధన్‌ను మాక్లూర్ సొసైటీకి డిప్యూటేషన్‌పై పంపుతూ 2024 మే 2 న ఉత్తర్వులు జరిచేశారు. అప్పటికే మాక్లూర్ సొసైటీ సీఈఓగా సంతోష్ ఉన్నాడు. ఒక వ్యక్తి పనిచేస్తుండగ మరో వ్యక్తికి పోస్టింగ్ ఇవ్వడం చర్చ నీయాంశంగా మారింది. విష్ణు వర్ధన్ 1985 అక్టోబర్ 1 నుండి మాక్లూర్ సీఈఓగా పనిచేస్తునారు. ముప్పై సంవత్సరాలుగా ఒకే చోట పని చేయడంతో పాటు, అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో 2022లో నిజామాబాద్ సొసైటీకి బదిలీ చేశారు. అప్పటి నుండి సొసైటీ పరిధిలో అసిస్టెంట్ కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోష్‌ను రెగ్యులర్ కార్యదర్శిగా నియమించారు.

రెగ్యులర్ కార్యదర్శి ఉండగా డిప్యూటేషన్‌పై మరో కార్యదర్శి నియామకం...

మండల కేంద్రంలోని సొసైటీలో రెగ్యులర్ కార్యదర్శి ఉండగా మరో కార్యదర్శిని జిల్లా అధికారి డిప్యూటేషన్‌పై అదే సొసైటీకి పంపడంపై స్థానిక రైతులు, సిబ్బంది ఆశ్చర్యానికి గురౌతున్నారు.

సీటు కోసం కార్యదర్శుల తంటాలు..

కార్యదర్శి సీటు కోసం ఇద్దరు కార్యదర్శులు అనేక తంటలు పడుతున్నారు. రెగ్యులర్ కార్యదర్శిగా ఉండగా డిప్యూటేషన్ పై మరొకరిని నియమించడంతో ఒకరు కోర్టు మెట్లు ఎక్కారు. మరో కార్యదర్శి అధికార పార్టీ నాయకుల మెట్లు ఎక్కుతున్నట్టు సమాచారం. ఇద్దరు కూడా తమ బలం కోసం ఒక్కరు డైరెక్టర్లకు, నాయకులకు, మరొకరు అధికార పార్టీ నాయకులకు దావతులు ఇస్తున్నట్లు సమాచారం.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్యదర్శులు..

ఈ ఇద్దరు కార్యదర్శుల మీద అవినీతి ఆరోపణలున్నాయి. వీరిద్దరూ సీఈఓ కుర్చీ కోసం పోటీ పడటం విడ్డురంగా ఉందని స్థానిక రైతులు చెవులు కొరుక్కుంటున్నారు. ఏదైనా పని మీద సొసైటీకి వెళ్తే ఏ సీఈఓ ను ఆశ్రయించాలో అర్ధం కావటం లేదని రైతులు అసహనం వ్యక్త చేస్తున్నారు. ఉన్నతాధికారులు సొసైటీలో ఉన్న అక్రమాలను ఎండ కట్టి రికవరీ చేసే విదంగా చర్యలు తీసుకొని, సొసైటిని గాడిలో పెట్టే కొత్త సీఈఓను నియమించాలని రైతులు ఉన్నత అధికారులను కోరుతున్నారు.

జీజీహెచ్‌లో బోనాలు

- బోనమెత్తిన డాక్టర్ ప్రతిమ రాజ్


బోనాలతో వెళ్తున్న సూపరింటెండెంట్, జీజీహెచ్ సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఏడాది ఆషాడమాసంలో నిర్వహించే బోనాలను ఈ సంవత్సరం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డా. ప్రతిమరాజ్ సూపరింటెండెంట్ బోనం ఎత్తారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లోని బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్ళి అమ్మవారికి వస్త్రాలు, ఒడి బియ్యం లాంఛనాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాల తో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

మానాలకు సన్మానం


మానాలను సన్మానించిన్న సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డిని సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్ భగవాన్, సివోవో రాజేంద్ర కుమార్ విక్రమ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ వినోద్ కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మానాల మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. మొదట చైర్మన్ మోహన్ రెడ్డితో సంస్థ బ్రోచర్లను విడుదల చేయించారు అనంతరం సూర్య ఆరోగ్య సంస్థ చేస్తున్న ఆరోగ్య శిబిరాలు, టీబి పరీక్షలు, హెచ్ఐవి పరీక్షలు, వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న పౌష్టిక ఆహార కిట్ల గురించి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, దంత పరీక్షలు, అద్దాల పంపిణీ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. సూర్య ఆరోగ్య సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని చైర్మన్ మోహన్ రెడ్డి వారికి హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ సహార ప్రెసిడెంట్ నరసింహారావు, ధనుంజయ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినాయక్ నగర్‌లో చోరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని వినాయక్ నగర్‌లో శనివారం అర్ధరాత్రి దొంగతనం జరిగిందని నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పాండేరావు తెలిపారు. ఎస్ఐ పాండేరావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు ఏడు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఇంటి యజమాని వెంకటి తన భార్యతో కలిసి శనివారం సాయంత్రం వేములవాడ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం పనిమనిషి దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చింది. నాలుగో టౌన్ ఎస్సై పాండేరావ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. వివరాలు పూర్తిగా తెలియలేవని కుటుంబీకులు వచ్చాక మిగతా వివరాలను వెల్లడిస్తామన్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ప్రముఖ వైద్యులు అమృత్ రాంరెడ్డి



రక్త పరీక్ష చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు అమృత్ రామ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గంగ హాస్పిటల్‌లో ఆదివారం ఆర్మూర్ ప్రెస్ క్లబ్, నవనాథపురం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు ప్రెస్ క్లబ్‌అధ్యక్షులు నెమలి ప్రశాంత్, మంచిర్యాల నరేందర్ మాట్లాడుతూ వైద్యులు ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా 71 రక్త పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సొక్కల తిరుపతి, రాకేష్, సునీల్ పురుషోత్తం, చరణ్ గౌడ్, విన్సెంట్, రితీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోధనలో ఘనంగా జగన్నాథ రథయాత్ర

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో శనివారం జగన్నాథ రథయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ రథయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గూండా కొనసాగింది. భక్తులు ఆటపాటలతో రథయాత్రలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎక్కడ?

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు


పేరుకుపోయిన చెత్తాచెదారం

నవతెలంగాణ-ఎడపల్లి

అసలే వర్షాకాలం ఆపై ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. ఓవైపు అధికారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు చెబుతున్నారు. మరోవైపు గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోయి దోమలు, పందులు సైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో 14వార్డులు ఉన్నాయి. వార్డులో మురికి కాలువలు పేరుకుపోయి చెత్తాచెదారం పేరుకుపోయింది. గ్రామపంచాయతీ సిబ్బంది శుభ్రం చేయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులను, సిబ్బందిని పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల స్థాయి అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది పరిసరాలను ప్రాంతాలను, మురికి కాలువలను శు భ్రం చేయడంలో, చెత్తను ఎత్తివేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువలు, పరిసరాలు పరిశుభ్రంగాలేక దోమలతో రోగాల బారిన పడుతున్నామని నయాబారి 12వ వార్డులో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు సైర విహారం చేస్తున్నడం వలన కాలనీలో దుర్వాసన వెదజల్లుతుందని, దీనివలన అనారోగ్యాల పాలవుతున్నారని కాలనీవాసులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గ్రామపంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా చెత్తాచెదారని తొలగించడం లేదని, దీంతో దోమలు పెరిగిపోయి కనీసం నిద్రపోలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడపల్లి పాత గ్రామంలో చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్ కు తరలించేందుకు ఉండగా మరో ట్రాక్టర్ను నయాబజార్ ప్రాంతానికి గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు వచ్చిన దాఖలాలు లేవని, రెండు నెలల నుచి ఇలాగే ఉందని పంచాయతీ అధికారుల, సిబ్బంది పనితీరుపై మండిపడుతున్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే డెంగ్యూ, మలేరియా కలరా, ఇతర వ్యాధులు సోకే ప్రమాదాలు ఉన్నాయని కాలనీవాసులు తీవ్ర ఆందోళన గురవుతున్నారు. అన్ని వార్డుల్లో మురికి కాలువలను శుభ్రం చేస్తూ రోజువారీగా డంపింగ్ యార్డ్‌కు తరలించి, వారానికి ఓసారి లేదా పక్షంలోకి ఓసారి, మురికి కాలువలలో దోమల నివారణకు పిచికారి చేయించారని గ్రామస్తులు గ్రామపంచాయతీ అధికారులను సిబ్బందిని కోరుతున్నారు.

లిఫ్ట్ సమస్య పరిష్కరించండి


వినతి పత్రం అందజేస్తున్న చిట్టాపూర్ గ్రామ పెద్దలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామ పెద్దమనుషులు ఆదివారం మోర్తాడ్ ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డిని చిట్టాపూర్ లిఫ్ట్ సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. లిఫ్టు మంజూరు అయిన పనులు జరగడం లేదని సునీల్ కుమార్ రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ రెడ్డి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో వీడిసి సభ్యులు లింగన్న, రాజారాం, రామరాజు, ధూమ్ రాజు, తెడ్డు సాయిలు, సత్యరాజు, రమేష్, సత్యం, కాంగ్రెస్ కార్యకర్త హరీష్ పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు మోర్తాడ్ మండలం దోన్‌పాల్ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పాల్గొంటారు. మధ్యాహ్నం 11.30 గంటలకు భీంగల్ మండల కేంద్రంలోని బంజారా భవన్ లో భీంగల్ మండల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు.

బోనమెత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గాండ్ల సంఘం ఆధ్వర్యంలో కోటగల్లిలోని కోటమైసమ్మకు నిర్వహించిన బోనాల పండుగకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ పండుగల్లో ఒకటి బోనాల పండుగని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆషాడ మాసంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు, వర్షాలు సంమృద్ధిగా కురిసి అధిక పంటలు పండించాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కోట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు, 25 వ డివిజన్ కార్పొరేటర్ సిరి గాద ధర్మపురి, 25 వ డివిజన్ బిజెపి శక్తి కేంద్ర ఇంచార్జ్ పల్నాటి కార్తీక్, హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, భాస్కర్, గాండ్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు నిజామాబాద్ పాతకలెక్టర్ కార్యాలయం ముందు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత డిమాండ్ల పరిష్కారం గురించి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ధర్నాకు అధిక సంఖ్యలో పెన్షనర్లు హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. పెండింగులో ఉన్న 4 డిఏ, డీఆర్‌ను వెంటనే ప్రకటించాలని, 5వ డిఏ, డిఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే అది కూడా ప్రకటించాలని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ఈహెచ్ఎస్ అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లో గరిష్ఠ పరిమితి లేని నాణ్యమైన ఉచిత వైద్యచికిత్సలు అందించాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో రెండు వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచిత టెస్టులు, ఉచిత మందుల పంపిణీ చేస్తూ నాణ్యమైన వైద్యం అందించాలని తెలిపారు. గత ప్రభుత్వం యిచ్చిన 5శాతం ఐఆర్‌ను 20శాతంకు పెంచాలని, పిఆర్‌సి రిపోర్టును వెంటనే తెప్పించుకుని 1-7-2023 నుండి మానిటరీ బెనిఫిట్ చెల్లిస్తూ అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కుబేర్ లో పెండింగ్ లో యున్న మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ బిల్లులు, ఇతర బిల్లులు వెంట వెంటనే చెల్లించాలని, గత పిఆర్‌సి బిస్వాల్ కమిషన్ రికమండ్ చేసిన 20సంవత్సరాల సర్వీసుకు ఫుల్ పెన్షన్ 1-7-2018 నుండి వర్తింప జేయాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు యిచ్చి పెన్షనరీ బెనిఫిట్స్‌కు అనుమతించాలని తెలిపారు. సివిపి రెస్టోర్ 15 సంవత్సరాలు కాకుండా 12 సంవత్సరాలు పూర్తి కాగానే రెస్టోర్ చెయ్యాలని, తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో పెన్షనర్లు కూడా పాల్గొన్నారని, పెన్షనర్లకు తెలంగాణా ప్రత్యేక ఇంసెంటివ్ ప్రకటించాలని పేర్కొన్నారు. పెన్షనర్ల డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్మోహన్, జిల్లా కోశాధికారి ఈవీఎల్ నారాయణ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-వర్ని

చందూర్, మోస్రా, వర్ని మండలాల లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను నాయకులకు ఆదివారం అందజేశారు. తమ గ్రామాల్లో లబ్దిదారులకు చెక్కులను అందించాలని నాయకులకు చూచించారు. కార్యక్రమంలో చందూర్ మండల పిఏసిఎస్ చైర్మన్ ప్యారం అశోక్, సత్యనారాయణ, మేడిపల్లి మాజీ సర్పంచ్ రవి, దేవిసింగ్, మోస్రా నాయకులు పిట్ల శ్రీరాములు, వర్ని మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్, ఖరీమ్ పలు గ్రామాల మాజీ నాయకులు ఉన్నారు.

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంజినీరింగ్ కళాశాలల్లోకి లాటరల్ ఎంట్రీ కోసం టీజీ ఈసెట్-24 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ స్లాట్ బుకింగ్ ఈనెల 15 నుండి ప్రారంభం కానుందని జిల్లా సమన్వయ కర్త సి. శ్రీరామ్ కుమార్, సిస్టమ్ అడ్మిన్ కె. భాను చందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ తర్వాత అభ్యర్థులు ఈనెల 17న ఎంపిక చేసిన హెల్ప్ లైన్ సెంటర్ కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అభ్యర్థులు వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలలను ఎంచుకోవాలని, అభ్యర్థులు ఈ నెల 17, 18 తేదీల్లో వెబ్ ఆప్షన్లను ఎంచుకోవచ్చుని తెలిపారు. ఫైనల్ ఫేజ్‌లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ అయిపోయిన విద్యార్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి అని సూచించారు. అభ్యర్థి మొదటి దశలో సీటును కేటాయించినప్పటికీ, ఆ సీటుతో సంతృప్తి చెందకపోతే, మొదటి దశలో సీట్లు కేటాయించబడకపోతే, వారు వెబ్ ఎంపికలను ఎంచుకోవచ్చని, సీట్ల కేటాయింపు ఈ నెల 21 లోపు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ సెంటర్‌ను, వెబ్ సైట్ https://tgecet.nic.in ని సందర్శించాలని అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, సామాజిక సేవకులు పట్వారి తులసి కుమార్ కలిసి మొక్కలు నాటి గ్రీన్ చాలెంజ్ తెలియజేశారు. ఇంటి ఆవరణలో ఆఫీస్ ఆవరణలో పాఠశాల కళాశాల స్థాయిలో యువత, విద్యార్థులు ప్రజలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. పట్వారి తులసి వ్యక్తిగతంగా దేశ శ్రేయస్సుకు ఉపయోగపడే ఆలోచనలతో ముందుకు వెళ్లడం అభినందనీయమని అన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం

- ఎమ్మెల్యే ప్రొచారం శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-పోతంగల్

అందరం కలిసి కాంగ్రెస్ బాటలో నడుద్దామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని హెగ్డోలి గ్రామంలో జరిగిన కాంగ్రెస్ ఆత్మీయ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత, కొత్త అని బేదం లేకుండా అందరు కలిసి ఒకే బాటలో నడిచి, నియోజకవర్గం అభివృద్ధి చేయాలన్నారు. కాసుల బాలరాజు రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ అయినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఆయనకు సోమవారం ఎస్ఎంబి ఫంక్షన్‌హాల్‌లో సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మద్నూర్

ఆగ్రో ఇండస్ట్రీస్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాలరాజ్ బాధ్యతలు చేపట్టి మొట్టమొదటిసారిగా సోమవారం ఉదయం 10 గంటలకు బాన్సువాడ పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా నిజాంసాగర్ గెస్ట్ హౌస్ నుంచి బాన్సువాడ కొయ్య గుట్ట నుంచి ఎస్ఎంబి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీగా స్వాగతం, అలాగే ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయగలరని ఆదివారం ఒక ప్రకటనలో సింగిల్ విండో మాజీ చైర్మన్ కొండ గంగాధర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ షెట్కర్, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అన్ని మండలాల అనుబంధ సంస్థల మండల అధ్యక్షులు విచ్చేస్తున్నారని తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా మొహరం పండుగ



జుక్కల్ :గ్రామంలో ఏర్పాటుచేసిన పీర్లు



ఆర్మూర్: అన్నదానం నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కులమతాలకు అతీతంగా మొహరం మాసంలో పీర్ల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. పూర్వం నుంచి ముస్లిం పండుగ అయినప్పటికి హిందువులే కీలకంగా పూజలు నిర్వహిస్తున్నారు. హిందు, ముస్లిం ఐక్యత ఎలా ఉంటుందో పీర్ల పండుగనే ఉదాహరణగా చెప్పవచ్చు. మొహరం మాసాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల పండుగను మసీదులలో హజ్రత్ అలీ, హజ్రత్ ఖాసీం దులే, హజ్రత్ నాలే హైదర్, హజ్రత్ హుస్సేన్, హుస్సేన్ బీబీ ఫాతీమా పీర్లను ఏర్పాటు చేసి నియమనిష్టలతో నిత్యం పూజలు నిర్వహిస్తారు. రోజుకో పీరు ఎత్తుకుని గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి బాజా భజంత్రీలతో శోభాయాత్ర నిర్వహిస్తారు. గ్రామస్తులు తమ మొక్కులను తీర్చుకుంటారు. రాత్రి పూట పీర్లు ఉన్న మసీదు వద్ద హజ్మ నత్యం మజీను నిర్వహిస్తారు. గ్రామ ప్రజలు పిల్లపాపలతో వచ్చి రాత్రంతా జాగారం చేస్తు చూస్తారు. ఐదురోజుల వరకు పండుగను నిర్వహిస్తారు. చివరి రోజు పెద్ద పీరు హుస్సేన్ బీబీ ఫాతీమా ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. గ్రామ ప్రధాన కూడలిలో పెద్దపీరును బాజాభజంత్రిలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి చివరి రోజు నత్యాలు, కామెడీ చేస్తు అనందోత్సవాలతో ముగిస్తారు. ఈ పీర్ల పండుగను తిలకించేందుకు మహరాష్ట్ర, కర్ణాటకల నుంచి జనాలు, బంధుమిత్రులు వందలాదిగా వచ్చివెళ్తుంటారు. మండలంలోని పడంపల్లి గ్రామంలో మహరం పండుగ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకంగా గ్రామ యువకులు పీ.శంకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మొహరం సందర్భంగా అన్నదానం

ఆర్మూర్: పట్టణంలోని మామిడిపల్లిలో మొహరం పండుగ సందర్భంగా ఉత్సవాలను ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రెండో రోజు ఆదివారం అన్నదానం నిర్వహించారు. తరతరాల నుంచి పీర్ల పండుగ ఘనంగా జరుపుతున్నమని, గత రెండేళ్లుగా అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాజిద్, అలీ సాబ్, ఖాదర్, హుస్సేన్, దిలీప్, మదర్, సతీష్, పెద్ద ఎత్తున ప్రజలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా మారిన సంక్షేమ వసతి గహాలు

ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు.ఎల్. దశరథ్

నవతెలంగాణ- కామారెడ్డి

సంక్షేమ వసతి గహాలు సమస్యలకు నిలయంగా మారాయని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు.ఎల్. దశరథ్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్లను సందర్శించగా విద్యార్థులు అనేక సమస్యలతో కాలం గడుపుతున్నారని తమ దృష్టికి వచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు దశరథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్, నిజం సాగర్ చౌరస్తా ఎస్సీ హాస్టల్, ఆనంద నిలయం, ఎస్టీ హాస్టలను సందర్శించడం జరిగిందన్నారు. విద్యార్థులు చాలీచాలని అన్నం పెడుతున్నారని, అన్నంలో ఇసుక రాళ్ళ వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నాసిరకమైన పప్పులు, కూరలు వండుతున్నారని తెలిపారు. ఎస్సీ ఆనంద నిలయంలో విద్యార్థులకు గదులు సరిపోక బయట వరండాల్లో నిద్రిస్తున్నారని, కొత్త బెడ్ షీట్స్, పెట్టెలు ఇప్పటివరకు ఇవ్వలేరని ఆయన అన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ పి శివప్రసాద్ మాట్లాడుతూ బయట టిఫిన్ చేస్తే 30 రూపాయల నుండి 40 ఉందని, ప్రభుత్వ కనీస ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, నోట్ బుక్స్, అన్నం ప్లేట్లు, పెట్టెలను, గదులలో ఫ్యాన్లు, దోమతెరలను అందించాలని, విద్యార్థులకు అనుగుణంగా మరుగుదొడ్లు, బాత్రూమ్స్ నూతనంగా నిర్మించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు రూములు సరిపోక బయట నిద్రిస్తున్నారన్నారు. స్నానం చేసే రూములకు సరైన డోర్లు లేవని అన్నారు. రెండు మూడు హాస్టళ్లకు ఒకరే ఇన్చార్జి వార్డెన్ పనిచేస్తున్నారని, హాస్టల్లో ఖాళీగా ఉన్న కుక్, స్లీపర్, వాచ్మన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎల్ సంపత్, పి జస్వంత్, ఆర్య, మనోజ్, సిద్ధార్థ, జగదీష్, విష్ణు, నర్సింలు, జగన్, రాకేష్, శ్రవణ్, సతీష్, శివకుమార్, గబ్బర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-పోతంగల్

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్ దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు పాత కలెక్టరేట్ ధర్నా చౌక్ నందు ఉదయం 10:30 గంటలకు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు కె. రామ్మోహన్‌రావు

పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు తెలిపారు. ఆదివారం బోధన్ పట్టణంలో డివిజన్ అధ్యక్షులు విక్రమ్ కస్తూరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాత్సారం చేస్తూ మొండిగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సూదం మదన్ మోహన్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంలో పిఆర్‌సి బకాయి పడ్డ డిఏల విడుదల, నగదు రహిత వైద్యం, తదితర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా వాటిపై అతీ గతి లేదని ఆయన అన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు ప్రకాశం, కోశాధికారి సత్యానద్, డివిజన్ నాయకులు కోటేశ్వరరావు, అద్దంకి లింగయ్య, సీతారామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అంజేత

నవతెలంగాణ-భిక్కనూర్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని పెద్ద మల్లారెడ్డికి చెందిన ప్రవీణ్ కుమార్ అవయవ దానం చేసిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన కుటుంబ సభ్యులకు మండలంలోని పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆసరాగా నిలిచారు. ప్రవీణ్ కుమార్ నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న సిద్ధి రామేశ్వర ట్రస్ట్ సభ్యులు మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన నవీన్‌కు రూ.4వేలు అందజేశారు. ఎన్జీవో ప్రతినిధులు దుబాసి స్వామి, గుర్రాల ప్రవీణ్ కుమార్, గంగల వేణు, గంగల శివ.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ప్రవీణ్ కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి భోనాలు



మద్నూర్: గోదావరి జలాలను తెస్తున్న గ్రామస్తులు



ముప్కాల్‌లో..



ఎడపలిలో..

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్పి క్యాంప్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. . ఈ సందర్భంగా సంఘం పెద్దలు నాయిని బలరాం మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమద్ధిగా పండాలని కోరారు. కార్యక్రమంలో పోల్క స్వామి, భాగయ్య, వెంకటి, నర్సింలు, రవి కుమార్, శ్రీనివాస్, గోపి, గంగాధర్, శంకర్, నాయిని నర్సింలు, కష్ణ, మహేష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండల కేంద్రంలో ప్రతి సంవత్సరంలాగ సంస్కతి సంప్రదాయాలతో పండుగను నిర్వహించారు. ఈ సందర్బంగా మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్దలతో బోనాలు, నైవేద్యాలు సమర్పించారు.

జుక్కల్ :మండలంలోని బిజ్జల్‌వాడీ గ్రామంలో బారడీ పోచమ్మ పండుగను గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని మాజీ సర్పంచ్ గౌళే యాదు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలను ఎత్తుకుని నైవేద్యాలు చేసి గ్రామ దేవతలకు సమర్పించారు. పాడి పంటలు సమద్ధిగా పండాలని, వర్షాలు సకాలంలో పడాలని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీ.యాదు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం..

మద్నూర్ :ప్రజాభవన్‌లో నల్ల పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సతీమణి తోట అర్చన దంపతులు పాల్గొన్నారు. ఈ బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విశిష్ఠ అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, నారాయణ పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఈ ఉత్సావాల్లో పాల్గొన్నారు.

ఎడపల్లి :మండలంలోని అంబం (వై) గ్రామస్తులు గంగమ్మ (గోదావరి) నీళ్లతో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు సమద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని, రైతులు, గ్రామస్తులు ఆనందంగా ఉండాలని కోరారు.

నల్ల పోచమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు..

ముప్కాల్ :మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామస్తులు గ్రామ దేవతలకు జలాభిషేకం ఆదివారం నిర్వహించారు. శ్రీరాంసాగర్ గోదావరి నది ఒడ్డు నుంచి గంగానీళ్లతో గ్రామంలోని గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. మహిళలు బోనాలతో దేవతలకు నైవేద్యం సమర్పించారు. గ్రామ దేవతలకు గంగానీళ్ల సమర్పించడం ద్వారా వర్షాలు సంవద్ధిగా కురుస్తాయని, రైతులు వేసిన పంటలు పుష్కలంగా ఉంటాయని గ్రామస్తుల నమ్మకం. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల ప్రతినిధులు, కుల వత్తి దారులు, మహిళలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి

- విద్యార్థినులను పరామర్శించిన అదనపు కలెక్టర్




విద్యార్థిని పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగర శివారులోని దాస్ నగర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కస్తూర్బా పాఠశాల విద్యార్థినులను అదనపు కలెక్టర్ అంకిత్ పరామర్శించారు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు ఈశ్వరి(11), గౌతమి (13) లను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపగా, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. న్యాయం జరిగేలా చూస్తామని బాధిత కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అంతకుముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ సంఘటన స్థలాన్ని సైతం సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు అధికారులకు సూచించారు.

ధర్మారం గురుకుల విద్యార్థులకు ఐఐటిలో సీటు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ ప్రభుత్వం చేత నిర్వహించబడుతున్న ధర్మారంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ ప్రతిభ కళాశాలలో ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి యన్ఐటి , ఐఐఐటి, సిఎఫ్‌టిఐలో సీట్లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రకటించిన సీట్ల కేటాయింపులో పి.అభినయ ఐఐటి (బియాచ్‌యు)వారణాసిలో బిటెక్ ఫార్మ సిటికల్ ఇంజనీరింగ్‌లో, బి.వర్ష యునివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో ఇంటిగ్రేటెడ్ ఎం టెక్ (కంప్యూటర్ సైన్సు), యన్ కృతజ్ఞ కు ఐఐ టి దర్వాడ్‌లో డేటా సైన్సు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ లో సీట్లు సాధించారని తెలిపారు. ఇంకో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు మిగిలి ఉందని, సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను తల్లి దండ్రులను రీజినల్ కోఆర్డినేటర్ అలివేలు, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అధ్యాపకబృందం అభినందించారు.

వనమహోత్సవానికి అంతా సిద్ధం

- 1.20, వేల మొక్కలు నాటడమే టార్గెట్
- ఒక్కో గ్రామ నర్సరీలో పదివేల మొక్కలు పెంపు
- మండలంలో 2.50లక్షలు మొక్కలు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గ్రామాల్లో పచ్చదనం సంతరించుకునే విధంగా వనమహోత్సవం పండగలా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 25 గ్రామపంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి గ్రామానికి పదివేల మొక్కలు అందించే విధంగా మొక్కలు పెంచారు. మండల వ్యాప్తంగా రెండు లక్షల 50 వేలు మొక్కలు పెంచడం జరిగింది. మండలంలో ఖాళీ స్థలాలలో పాఠశాల ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే 2015 నుంచి దాదాపు ప్రకతి వనాలలో మొక్కలను నాటడం జరిగింది. వర్షాలు కురియగానే గ్రామాలలో ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ..

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసినట్టు ఏపీవో సాయిలు తెలిపారు. మండల వ్యాప్తంగా 30 వేల మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

1.20 వేల మొక్కలు నాటడమే లక్ష్యం..

మండల వ్యాప్తంగా 1.20 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు ఏపీవో సాయిలు తెలిపారు. వర్షాలు కురియగానే గ్రామాలలో మొక్కలను నాటేందుకు ప్రాణాలికలు సిద్ధం చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

25 గ్రామపంచాయతీలలో 2 లక్షల 50 వేల మొక్కలు పెంపు..

వనమహోత్సవానికి ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ పరిధిలో పదివేల మొక్కలు చొప్పున 25 గ్రామపంచాయతీ పరిధిలలో గల నర్సరీలలో రెండు లక్షల 50 వేల మొక్కలు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వర్షం కురవగానే మొక్కలు నాటడమే లక్ష్యం..

గ్రామాలలో ప్రభుత్వ స్థలాలలో గుంతలు ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీవో సాయిలు తెలిపారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కల కొరకు తీసిన గుంతలలో మొక్కలు వెంటనే నాటడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- విద్యార్థులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యద్వారానే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య ఆఫీసియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోప) ఆధ్వర్యంలో నిర్వహించిన బంగారు పథకాల బహుకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఎంసెట్, నీట్, ఐఐటిలలో అత్యంత ప్రతిభ కనపర్చిన 23 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు ఎమ్మెల్యే బంగారు పతకాలు బహుకరించారు. ఈ సందర్బంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యలలో ప్రతిభవంతమైన విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అవోప వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లితండ్రులకు, నిజామాబాద్‌కు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. చదువుకునే పేద విధార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియజేసారు. ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను అవోప కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మలిపెద్ది శంకర్ గుప్త, రాష్ట్ర అవోప అధ్యక్షులు, హైదరాబాద్, పోల శ్రీధర్ గుప్త రాష్ట్ర కార్యదర్శి, హైదరాబాద్, కందికొండ శ్రీనివాస్ గుప్త రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి, హైదరాబాద్, కొండ వీరశేఖర్ గుప్త అధ్యక్షులు ఆర్యవైశ్య సంఘం (పట్టణ), ధన్‌పాల్ శ్రీనివాస్ గుప్త అధ్యక్షులు, నూతన వైశ్య ఉన్నత పాఠశాల (మాణిక్ భవన్) పెండ్యాల శ్రీనివాస్ గుప్త, అధ్యక్షులు కన్యకాపరమేశ్వరి దేవాలయం గజవాడ గణేష్‌గుప్త, జిల్లా అధ్యక్షులు, పాల్గొన్నారు.

19 మంది విద్యార్థులకు సిల్వర్ మెడల్స్

- విద్యార్థులను సన్మానించిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్



సిల్వర్ మెడల్స్ పొందిన విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అవోపా ఆధ్వర్యంలో 2023-2024 సంవత్సరాలలో ఎస్ఎస్సి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 19 మంది విద్యార్థులను సిల్వర్ మెడల్స్‌తో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విద్యను అభ్యసించాలని తమ నైపుణ్యాన్ని స్వలాభంతో పాటు సమాజ శ్రేయస్సుకు దోహదపడే విధంగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవాలని తెలిపారు. కీర్తిశేషులు కొమ్మ మల్లయ్య జ్ఞాపకార్థం అతని కుమారుడు కొమ్మ జ్ఞానేశ్వర్ సిల్వర్ మెడల్స్‌ను అందించడం హర్షనీయమని ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇరిగేషన్ మల్లేష్ మాట్లాడుతూ.. పదవ తరగతి ఇంటర్మీడియట్‌లలో వచ్చిన మార్కులతో అతిగా ఆనందపడవద్దని అలాగే బాధపడవద్దని తాను కూడా ఇంటర్మీడియట్ వరకు యావరేజ్ స్టూడెంట్‌నని తర్వాత పట్టుదలతో చదివి అంచలంచలుగా ఎదిగి నేడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని విద్యార్థులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ప్రధాన కార్యదర్శి తప్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదివిన ప్రతి విద్యార్థి విజయం సాధిస్తాడని ఈ సందర్భంగా సన్మానం పొందుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకొచ్చే విధంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక కార్యదర్శి బెజగం గంగ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితం కీలకమైనదని ఒక రంగం అనే కాకుండా అన్ని రంగాలలో సర్వతోముఖాభివద్ధి పొందే విధంగా విద్యార్థులు కషి చేయాలని ఆ దిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఆవోప కామారెడ్డి పూర్వ అధ్యక్షులు టి కష్ణమూర్తి, గంగా ప్రసాద్, సలహాదారు శ్రీధర్, పూర్వ కార్యదర్శి శ్రీధర్, పలువురు పూర్వ పెద్దలు, కార్యవర్గ సభ్యులు సత్యసేన, ప్రవీణ్, మహేష్, సంతోష్, శరత్, శ్రీనివాస్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెలే క్యాంపు కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-జుక్కల్

ఎమ్మెలే క్యాంపు కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని సిఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్స్ నెరవెర్చాలని కోరుతూ జుక్కల్ ఎమ్మెలే క్యాంపు కార్యాలయాల ముట్టడి, డిమాండ్లతో కూడీన వినతి పత్రం అందించడం జర్గుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పోడు భూముల రైతులకు పట్టాలివ్వాలి

• పోడు భూముల సాధన కమిటీ డిమాండ్

నవతెలంగాణ-వర్ని


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతర నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని చందూర్ మండల కేంద్రంలో పోడు భూముల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ నన్నెసాబ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద రైతుల పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పందించి సమస్య పరిష్కారానికి ---కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడు రైతులు సాయిబాబా, వెంకన్న సాయిలు, శ్రీను హన్మాండ్లు, సాయి అబ్బయ్య సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లను సరి చేసుకోండి

• విద్యుత్ శాఖ ఏఈ రవి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకొని.. '0' బిల్లు రాని అర్హులైన లబ్ధిదారులు.. పొరపాట్లను సరిచేసుకోవాలని విద్యుత్ అధికారి ఏఈ రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహజ్యోతి పథకంలో ఏమైనా పొరపాట్లను, సవరణలను చేసుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. పథకానికి దరఖాస్తు చేసుకునే సమయంలో ఆహార భద్రత కార్డు, కరెంట్ మీటర్ యూనిక్ సేవ సంఖ్య తదితర వివరాలు తప్పుగా నమోదు చేసి ఉంటే ఇప్పుడు సరి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులై జీరో బిల్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట మండలం పోల్కంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడికుందా లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీ గతంలో పోల్కంపేట గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వహించారని తెలిపారు. కాగా లక్ష్మీ భర్త మేడికుందా నారాయణ గతంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు శ్రీకాంత్, విజయ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ సర్పంచ్ మృతి చెందడంతో గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అంత్యక్రియల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


మృతి చెందిన నాగయ్య

ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కె.నాగయ్య(45) శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటేసిందని గ్రామస్తులు తెలిపారు. రాత్రికి రాత్రి హుటాహుటిన నాగయ్యను కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, ఆదివారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఎల్లారెడ్డి మండల పరిధిలో ఇటీవల పాముకాట్ల బెడద ఎక్కువైందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

నేడు బాల్కొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండలంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం పర్యటించనున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దొనకంటి నరసయ్య తెలిపారు. భీంగల్ పట్టణకేంద్రంలోని బంజారా భవన్‌లో నిర్వహించే కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్దిదారులకు చెక్కులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని పార్టీ శ్రేణులు కోరారు.

ముప్కాల్‌లో 'స్వచ్ఛత పక్వాడ్'

నవతెలంగాణ-ముప్కాల్

భారత్ పెట్రోలియం సంస్థ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమమైన 'స్వచ్ఛత పక్వాడ్-2024'ను జులై 1 నుంచి 15వ తేదీ వరకు చేపట్టినట్టు భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం మండల కేంద్రంలో నిర్వహించిన 'స్వచ్ఛత పక్వాడ్-2024' కార్యక్రమంలో పరిసరాలను శుభ్రపరిచినట్టు తెలిపారు. సోమవారం ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులు ఉదయ్ కిరణ్, మునాపతి బన్ని, డి.శ్రీనివాస్, క్రాంతి కుమార్, ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు తరలిరావాలి

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మెన్‌గా రాష్ట్ర కిసాన్ ఖేత్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని 'హాకా భవన్'లో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా మండలం నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కిసాన్ కాంగ్రెస్ ఖేత్ మండల అధ్యక్షులు బద్దం సాగర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా బ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఆదివారం సదాశివనగర్ మండలం మల్లనగుట్ట ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పాలోజ్యుల శ్రీనివాస్ శర్మ ప్రధాన కార్యదర్శిగా బొందుగుల పాటి సతీష్ కుమార్‌ను ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పురుషోత్తం శర్మ, రాజేశ్వర్ శర్మ, ప్రహలదారావు మహిళా ఉపాధ్యక్షులుగా ఎస్.సునీత, కోశాధికారిగా నవీన్ శర్మ సహాయ కార్యదర్శిగా ఉదయభాను, వెంకటేశ్వరరావు, వెంకటరమణ రావు ఎన్నుకున్నారు. సలహాదారులుగా కిషన్ రావు, అర్జున్ రావు, కాశినాద్ రావు ఎన్నికవ్వగా, కమిటీ సభ్యులుగా శ్రీధర్ జోషి, చక్రధర్ కులకర్ణి, శ్రీధర్ రావు కులకర్ణి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారున్ని కలిసిన రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీ యుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు ముఖ్య పాత్ర పోషించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడ్డ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలైన ఆరు గ్యారంటీల అమలును నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలు, నాయకులపైన ఉందన్నారు.

జిల్లా గంగపుత్ర అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా గంగపుత్ర అభివద్ధి కమిటీ నూతన కార్యవర్గంను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య మాట్లాడుతూ.. ఆదివారం స్థానిక గాజుల్ పేట్ గంగపుత్ర సంఘంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా పల్లికొండ అన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా బాలగంగాధర్, ఉపాధ్యక్షులుగా నారాయణ, సాయిలు, కోశాధికారి సుధీర్, ప్రచార కార్యదర్శులుగా లింగం, శ్రీనివాస్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా రాజు, దత్తు, అనిల్, ముఖ్య సలహాదారులుగా బాలయ్య, నర్సయ్య, వినోద్ కుమార్, శ్యామ్, న్యాయ సలహాదారులుగా రవికుమార్, గౌరవ సలహాదారులుగా ఆనంద్.. ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు తెలిపారు. చెరువులపై పూర్తి హక్కులు గంగపుత్రులకే ఉండాలని, బీసీ(ఏ)లో ఇతర కులాలను చేర్చొద్దని, గంగపుత్రులకు జిల్లా కేంద్రంలో సంఘ భవనంకు స్థలం, నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

రేణుక ఎల్లమ్మకు బోనాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మకు ఆషాడం బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు ఇంటికో బోనం తీసి నెత్తిపై ఎత్తుకొని శోభాయాత్రగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. యాటలను బలి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల నర్సాగౌడ్, హన్మ గౌడ్, నరేష్ గౌడ్, రవి గౌడ్, వెంకట్ గౌడ్, గౌడ, జనార్ధన్ గౌడ్, విజయ్ గౌడ్, మహేష్ గౌడ్, మహిళలు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దన్నూర్ గ్రామంలో బోనాల పండుగ..

మద్నూర్ : మద్నూర్ మండలం దన్నూరు గ్రామంలో ఆదివారం బోనాల పండుగను అంగారంగా వైభోగంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాదిలానే.. గ్రామ ప్రజలు.. ఇంటింటా నైవేద్యాలతో బోనాలు తీస్తూ గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులను ఎల్లవేళలా సుఖసంతోషాలతో ఉంచాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు బాగా పండాలని కోరుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ బోనాల పండుగలో గ్రామ పెద్దలు దేవిదాస్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సునీల్ రెడ్డి

ఆర్మూర్(వేల్పూర్)/కమ్మర్‌పల్లి : ఆర్మూర్, వేల్పూర్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాడ బోనాల కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహించారు. ఆలయ పూజారి అమ్మవారి ఆశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పాల్గొన్న సునీల్ కుమార్‌ను కౌండిన్య గౌడ సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఈ సందర్భంగా సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి : హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఆదివారం అధికారికంగా నిర్వహించిన బోనాల పండగ ఉత్సవంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పాల్గొనట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు, ప్రముఖులు తదితరులు హాజరు కావడంతో ప్రజా భవన్‌లో సందడి వాతావరణం నెలకొన్నది.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

జక్రాన్‌పల్లి/మోపాల్ : హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఆదివారం ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క నిర్వహించిన ఆషాడ మాసం బోనాల ఉత్సవాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే శ్రీ డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి పాల్గొన్నారు.


మద్నూర్: బోనాలతో వస్తున్న మహిళలు


ఆర్మూర్: సునీల్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మాక్లూర్



మాక్లూర్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, బాల్కొండలో...

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ 2001-2002 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సరిగ్గా 23 సంవత్సరాల క్రితం మాక్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నత చదువుల కోసం విడిపోయిన వారంతా ఒక చోటికి చేరారు. నాడు విద్యార్థి దశలో చోటుచేసుకున్న ఘటనలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులంతా కలిసి సంతోషంగా కాలక్షేపం చేశారు. పలువురు పూర్వ విద్యార్థుల ఉన్నతిని తెలుసుకొని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. రెండున్నర దశాబ్దాల క్రితం విద్యావ్యవస్థలో ఉన్న పరిస్థితులు నేటి పరిస్థితులు పోల్చుతూ ఉపాధ్యాయులు ప్రసంగించారు. మాక్లూర్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు మాదాపూర్, కృష్ణానగర్, దుర్గా నగర్, శాంతినగర్, ముల్లంగి గ్రామాల నుంచి కాలినడకన విద్యార్థులు వచ్చిన పరిస్థితులను ఉపాధ్యాయులు గుర్తు చేశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు అప్పల కిష్టయ్య, బాగేందర్, భూపతిరెడ్డి, మల్కయ్య, రవీందర్ గుప్తా, వేణుగోపాల్, గంగారెడ్డి, వెంకట రాజయ్య, దామోదర్, పురుషోత్తం దాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2000-01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆద్యంతం కోలాహలంగా కొనసాగింది. రెండున్నర దశబ్దాల తర్వాత చిన్ననాటి మిత్రులంతా ఒకచోట కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక్కచోటకు చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగి, ఆత్మీయంగా సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివ్ గౌడ్, అవారి గంగారెడ్డి, అవారి మురళి, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండలంలోని కిసాన్ నగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల 2000-2001 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వీ కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు దాదాపు 24 ఏండ్ల తర్వాత అందరూ ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు.. తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గురువులు నేర్పిన విద్యాబుద్ధులు.. జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడటానికి ఎంతో ఉపయోగపడ్డాయని పూర్వ విద్యార్థులు గురువులను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన అఖిల రవి భార్య ఇటీవల ఆనారోగ్యంతో మరణించగా.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బషీరాబాద్ గ్రామానికి చెందిన లింగన్న భార్య, అమ్మ దురదృష్టవశాత్తు మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. హాసకొత్తూర్ గ్రామానికి చెందిన భూమన్న బైపాస్ సర్జరీ జరిగి దురదృష్టవశాత్తు మృతిచెందగా.. ఆయనకు రూ.3లక్షల 75వేల ఎల్ఓసీని అందించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. ఇదే గ్రామంలో పెరాలసిస్‌తో బాధపడుతున్న గంగారం.. ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలెపు నరసయ్య, బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, సాయికుమార్ గుప్తా, పడిగెల ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

వడ్డెరలను ఎస్టీలో చేర్చాలని వినతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర సామాజిక తరగతిని బీసీ(ఏ) జాబితా నుంచి తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని కామారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శాప శివరామ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌కు ఆదివారం వినతి పత్రం అందించినట్టు ఎల్లారెడ్డి విద్యార్థి విభాగం అధ్యక్షులు లింగమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకి దిగజారుతున్న వడ్డెర్ల.. ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితి దిగజారి పోతుందన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చూడాలని జాజుల శ్రీనివాస్‌ను కోరినట్టు తెలిపారు.

కాకతీయ కాలువకు గండి మరమ్మతులు పూర్తి

• కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మెండోర మండల కేంద్రంలో కాకతీయ కాలువకు పడిన గండికి.. మరమ్మతు పనులు పూర్తి చేసినట్టు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మెండోరా మండల కేంద్ర పరిధిలో కాకతీయ కాలువకు గండి పడిన ప్రదేశాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకతీయ కాలువకు గండి పడటం వల్ల వారం రోజుల నుంచి నీటి సరఫరా ఆగిపోయిందని, వరి నాట్లు వేసే ఈ సమయంలో నీటి సరఫరా ఆగిపోవడం రైతులకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దాంతో గండి పడిన వెంటనే మరమ్మత్తుల కోసం ఇరిగేషన్ అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. అనుమతులు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ఒక కాంట్రాక్టర్‌కు ఈ పనులు చేయాలని అప్పజెప్పగా పనులు పూర్తయ్యాయని అన్నారు. ఒకటి, రెండు రోజుల్లో నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కాల్వకు పడిన గండికి మరమ్మతులు పూర్తవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలను మరింత విసతపర్చాలి

• లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ పి.లక్ష్మి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కైరంకొండ మురళి, గంగరాజు, కోశాదికారి రవిందర్‌లతో పాటు నూతన కార్యవర్గంచే లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ బసవేశ్వర రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ లక్ష్మి ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడుతూ సేవే లక్ష్యంగా ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ లు ముందుకు సాగుతున్నాయన్నారు. కరోనా సమయంలో లయన్స్ క్లబ్ లు విశేష సేవలందించాయని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పూర్వ గవర్నర్లు డి.పెంటయ్య, గంధాని శ్రీనివాస్, రీజియన్ చైర్మెన్ అనిల్ పటేల్, రీజియన్ కార్యదర్శి ద్వారకాదాస్ అగర్వాల్, కో ఆర్డినేటర్ డి.యాదగిరి, జోన్ చైర్మెన్ ఎస్.తులసీదాస్, నేత క్లబ్ ప్రతినిధులు అంకం లక్ష్మణ్, ధర్మరాజు,ప్రవీణ్ , పుల్గం హన్మాండ్లు,రాపెల్లి గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల హర్షం

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో ఆదివారం కురిసిన వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు.. పత్తి, సోయ, మొక్కజొన్న పంటలు వేశారు. అడపాదడపా చిరుజల్లులు కురిసినా.. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం మోస్తరుగా కురవడంతో పంటలకు నష్టం లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సూర్యుడు కనిపించడు.. వర్షం కురవదు..

• ఐదు రోజులు వర్షాలని చెప్పిన వాతావరణ శాఖ

• వాన పడకపోవడంతో రైతన్నల ఆందోళన

నవతెలంగాణ-మద్నూర్

ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఆకాశమంతా నల్లటి మబ్బులతో మేఘావృతమై ఉన్నప్పటికీ వర్షం కురవలేదు. దాంతో వర్షం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న రైతున్నలు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వాతావరణ కేంద్రం.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో (కామారెడ్డి) ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించి ఇప్పటికే మూడు రోజులైనా వర్షాలు పడకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. నీటి సౌకర్యం లేని కామారెడ్డి జిల్లాలో ఎక్కువ ప్రాంతాల్లో వర్షాధారం పైనే పంటలు పండిస్తారు. విత్తనాలు విత్తి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు విత్తనాలు మొలకెత్తక పోవడంతో పెట్టిన పెట్టుబడి వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానకోసం రైతన్నల ఎదురుచూపులు..

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, పేపర్ మిల్, బోర్గం గ్రామాల్లో ఆరుతడి పంటలు వేసిన రైతన్నలు.. వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఆరుతడి పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. వర్షాలు లేక చాలామంది రైతన్నలు.. దుక్కులు దున్ని పంటలు సాగు చేసుకోవడానికి పొలాలు సిద్ధంగా ఉన్నప్పటికీ సాగునీరు లేక ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందని మండలవాసులు తెలిపారు.